అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 3 సంచిక -76 శుక్రవారం 21 ఆగస్టు 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -6 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

2

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



## డీలిమిటేషన్‌తో అన్యాయం చేయొద్దు

### మహాబలిపురంలో జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

**పార్లమెంటులో రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడండి**

**చట్టసభల్లో స్థానాలు పెంచకుండానే మహిళా రిజర్వేషన్లు దక్షిణ ప్రాంతీయ మండలి**

**సమావేశంలో ముఖ్యమంత్రుల సూచన**

**చెన్నై : ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** తమిళనాడులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ (దక్షిణ ప్రాంతీయ మండలి) సమావేశంలో నియోజక వర్గాల పునర్విభజన, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్య పరిరక్షణ, నీట్ పరీక్ష, కావేరీ జలాల పంపిణీ, అధిక ఆర్థిక స్వయం ప్రతిపత్తి వంటి పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కాపాడేందుకు ఓ అధికారిక తీర్మానం చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కోరగా ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ కారణంగా తమ ప్రాంత రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా చూడాలని తమిళనాడు



ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ డిమాండ్ చేశారు. నదీ జలాల నిర్వహణ, రవాణా, లాజిస్టిక్స్, తీరప్రాంత భద్రత, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విపత్తు నిర్వహణ వంటి విషయాలలో దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత మిగతా 2లో.

## మూడు భాషల విధానం అమలుపై సుప్రీం అభ్యంతరం

**సీబీఎస్ఈ 3 పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం**

**ఈ విధానం అమలుపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశం**

**మూడు భాష విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందన్న ధర్మాసనం**



**ఢిల్లీఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది. మిగతా 2లో.

## మరోసారి యుద్ధం వస్తే మరింత విధ్వంసం..



**కొత్త ఆయుధాలు బయటికి తీస్తాం: ఇరాన్**

**కొత్త క్షిపణులు మరింత కచ్చితత్వంతో, ఎక్కువ శక్తితో ఉంటాయని వెల్లడి**

**అమెరికాతో రహస్య చర్చలు జరుపుతున్నామన్న వార్తలను ఖండన**

**ట్రంప్ వ్యాఖ్యలను ‘భ్రమ‘గా పేర్కొన్న ఐఆర్జీసీ ప్రతినిధి**

2లో.

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు**

**ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య**

**నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య**




2లో.

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది : రాహుల్ గాంధీ

**మోదీ, అమిత్ షా రాజకీయ ఆధిపత్యం తగ్గిందని వ్యాఖ్య**

**కాంగ్రెస్, ఇండియా కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడి**



**ఢిల్లీ ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని మిగతా 2లో.

## 5 బిల్లులు ఆమోదం

**శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్**

**విద్యా, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు**

**ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది**

**అమరావతి ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది.నేడు జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో మిగతా 2లో.



## 22ఏ దుర్వినియోగం

**రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి**

**మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి**

**రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు బహిరంగలేఖ**

**హైదరాబాద్‌ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
రాష్ట్రంలో సెక్షన్ 22ఏ దుర్వినియోగం అవుతున్నదని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి జరుగుతున్నదని తెలిపారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మిగతా 2లో.





## భూ భద్రత కోసమే భూ భారతి

**గతంలో బోగస్ పాస్ పుస్తకాలతో రైతుభరోసా స్వాహా**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

**ఖమ్మం,ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** గత ప్రభుత్వ హయాంలో భూమి లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా భూ భారతి ద్వారా సర్వే చేపడుతున్నామని స్పష్టం చేశారు. రైతుల భూములకు భద్రత కల్పించడంతో పాటు భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే భూ భారతి సర్వే ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో మిగతా 2లో.

## మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్..

**ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం**

**కోనసీమ మత్స్యకారుల గల్లంతుపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష**

**ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన ఎస్‌వోపీ అమలు చేయాలని అధికారులకు ఆదేశం**



2లో.

## నా కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

**: క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ వివరణ**

**హైదరాబాద్‌ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
సీఎం రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు.తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు.



# 22ఏ దుర్వినియోగం

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి గురువారం హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. సెక్షన్ 22ఏ అనేది నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ఆపడానికి తెచ్చిన చట్టమని తెలిపారు. ప్రయివేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి కాదని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్‌ఎండీఏ అనుమతులున్న వేలాది ప్రయివేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఏ జాబితాలో పెట్టి ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు మార్కెట్ విలువలో ఏకంగా 30 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏలో పెట్టారంటూ నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా చెప్పినా సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల భూములపై వివాదాలు సృష్టించి రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలని యజమానులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో ప్రయివేటు వ్యక్తుల లాభం కోసం ఇంత కుంభకోణం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

# తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

**నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత**

**పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి**

**బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్**

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు. భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22



ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ఆస్తులు భద్రంగా ఉండాలంటే ఆర్మీని దింపాలని ఇటీవల హైకోర్టు వ్యాఖ్యలు చేసిందన్నారు. ఎవరి ఇళ్లు ఎప్పుడు నిషేధిత జాబితాలోకి వెళ్తుందో అని ప్రజలు భయపడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం..

**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**

**ఢిల్లీఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం నిరాకరించింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై 'డేంజర్ బెల్స్' మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం... పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది.

అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించి, ఆ ఆదాయంతో సంక్షేమం చేపట్టవచ్చని సూచిస్తూ, సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలకం

**మొదటిపేజీ తరువాయి**

సహకారం అవసరమని సమావేశానికి హాజరైన నేతలు అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్ష గ్రామీణ విద్యార్థులకు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రతికూలంగా ఉన్నదని జోసఫ్ విజయ్ చెప్పారు.

తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర కోటా కింద ఎంబీబీయస్, బీడీయస్, ఆయుష్ కోర్సులలో ప్రవేశాలను 12వ తరగతి మార్కుల ఆధారంగా చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు. కాగా సమావేశంలో నదీ జలాల అంశం కూడా ప్రధానంగా చర్చకు వచ్చింది. మేకెదాటు ప్రాజెక్టు విషయంలో సహకరించాలని కర్నాటక కోరగా గోదావరి కావేరి అనుసంధాన ప్రాజెక్టు ద్వారా ఐదు వందల టీయంసీలకు పైగా నీటిని మళ్లించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించారు. కొత్తగా ప్రతిపాదించిన ముల్లపెరియార్ ఆనకట్ట ప్రాజెక్టుకు తమిళనాడు అంగీకరిస్తే దాని నుంచి వారికి నీరు అందేలా చూస్తానని కేరళ హామీ ఇచ్చింది. అదే సమయంలో ఓడరేవులు, రైలు అనుసంధానం, తీర ప్రాంత రక్షణ, అంతర్రాష్ట్ర భద్రత విషయంలో మరింత ప్రాంతీయ సహకారం అవసరమని అభిప్రాయపడింది.

**రాష్ట్రాలను శిక్షించవద్దు : విజయ్**

జనాభా నియంత్రణ విధానాలను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాలు దాని పర్యవసానంగా తమ రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోల్పోకూడదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అన్నారు. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన దక్షిణ రాష్ట్రాల సమిష్టి పార్లమెంటరీ వాణిని బలహీనపరుస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 'జనాభా స్థిరీకరణ, మానవాభివృద్ధి, ఆర్థిక వృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ఈ విజయాలు మా ప్రాతినిధ్యంలో తగ్గుదలకు దారితీయకూడదు' అని అన్నారు. జాతీయ లక్ష్యాలను నెరవేర్చినందుకు రాష్ట్రాలను శిక్షించకూడదని చెప్పారు.

**ప్రస్తుత స్థానాలతోనే మహిళా రిజర్వేషన్లు : డీకే**

1971 జనాభా లెక్కల ప్రాతిపదిక ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరపాలని, రాబోయే పాతిక సంవత్సరాల పాటు లోక్‌సభలో సీట్ల సంఖ్యను 543గానే కొనసాగించాలని, ప్రస్తుత సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సూచించారు. డీలిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలు సీట్లను కోల్పోవంటూ కేంద్రం ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామని, అయితే ప్రాతినిధ్యం అంటే కేవలం సంఖ్య మాత్రమే కాదని, అది బలం, గొంతుకకు సంబంధించినదని చెప్పారు. పన్నులలో కర్నాటక వాటాను 3.6 శాతం నుంచి 4.7 శాతానికి పునరుద్ధరించాలని కోరారు. కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్రం మరింత మద్దతు అందించాలని విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**తీర ప్రాంత కోతలపై జాతీయ విధానం : సతీశన్**

మైనింగ్ చట్టానికి ప్రతిపాదించిన సవరణలను ఉపసంహరించుకోవాలని కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ డిమాండ్ చేశారు. మిషన్ సముద్ర కింద రాష్ట్రాన్ని పోర్ట్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రాంతీయ సహకారం అందించాలని కోరారు. కారుణ్య ఆరోగ్య సురక్షా విధానం ద్వారా ఆయుష్మాన్ భారత్ పీయం జేఏవై అమలుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తీర ప్రాంతంలో కోతను రాష్ట్ర విపత్తుగా ప్రకటించి నిరాశ్రయులైన కుటుంబాల పునరావాసం కోసం నిధుల వినియోగానికి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంత కోతలపై జాతీయ విధానాన్ని త్వరితగతిన ఖరారు చేయాలని సూచించారు. కేరళను కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలతో కలిపే అటవీ రహదారులపై రాత్రి సమయంలో పూర్తి స్థాయిలో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేయడాన్ని సతీశన్ వ్యతిరేకించారు.

**విభజన సమస్యలను పరిష్కరించండి : చంద్రబాబు**

దక్షిణాది రాష్ట్రాల మధ్య మరింత సహకారం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలను విశ్వాసం, పరస్పర సహకారంతో పరిష్కరించుకోవచ్చునని అంటూ దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి సమన్వయం పైనే ఆధారపడి ఉంటుందని చెప్పారు. రాష్ట్ర విభజన కారణంగా తలెత్తిన సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు. గోదావరి కావేది అనుసంధానాన్ని ఆయన గట్టిగా సమర్ధించారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలను కలుపుతూ బులెట్ రైలు కారిడార్‌ను ప్రతిపాదించారు. అమరావతి, బెంగళూరు, చెన్నయ్‌లను అనుసంధానించే సమీకృత రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా చంద్రబాబు కోరారు.

# మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్..

**ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం**

**అమరావతి ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానం మలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.సమీక్ష సందర్భంగా చంద్రబాబు పలు కీలక ప్రశ్నలను అధికారులపై సంధించారు. "బోటులో ట్రాన్స్‌పాండర్ ఏమైంది? ఆ బోటు ఒక్కటే ఎందుకు వేటకు వెళ్లింది? గల్లంతైనట్లు సమాచారం ఎప్పుడు అందింది? గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు?" అంటూ లోతుగా ఆరా తీశారు. కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.ఈ నెల 3వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. సాధారణంగా 10 రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన బోటులో 15 రోజులకు సరిపడా రేషన్, వెయ్యి లీటర్ల డీజిల్ ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం బోటు విశాఖ లేదా పారాదీప్ వైపు వెళ్లి ఉండవచ్చని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు.ప్రస్తుతం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక లోపాలు, భద్రతా వైఫల్యాలపై దృష్టి సారించాలని సూచించారు.గల్లంతైన మత్స్యకారుల వివరాలు: కోపనాతి రామకృష్ణ (కొమరగిరిపట్నం), సంఘాని తాతారావు (బలుసుతిప్ప), పాలెపు శాంతారావు (ఓడలరేవు), ఏసుదాస్ (అడగట్లపాలెం), కొల్లాటి శ్రీనివాస్ (ఓడలరేవు), కాటాడి సతీశ్ (పశువులంక), కర్రి రాముడు (నక్క రామేశ్వరం). వీరి ఆచూకీ కోసం అధికారులు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు.

# 'మార్గదర్శి'కి సుప్రీంలో భారీ ఊరట.. ఉండవల్లి పిటిషన్ కొట్టివేత

**ఢిల్లీ ఆగస్టు 20 ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
ఈనాడు గ్రూప్ నకు చెందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఆ సంస్థకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ కేసులో ప్రజా ప్రయోజనం ఏమీ కనిపించడం లేదని, ఇది వ్యక్తిగత వివాదంలా ఉందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

గురువారం ఈ పిటిషన్‌పై తుది విచారణ సందర్భంగా మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, నాగముత్తు వాదనలు వినిపించారు. డిపాజిటర్లకు ఇప్పటివరకు రూ.2,500 కోట్లు చెల్లించామని, క్లెయిమ్ చేయని రూ.5.23 కోట్లను ఎస్క్రో అకౌంట్‌లో ఉంచామని వారు కోర్టుకు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే పబ్లిక్ నోటీసు జారీ చేసి, సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు.

ఈ సమయంలో ధర్మాసనం పిటిషనర్ ఉండవల్లి అరుణ్ కుమార్‌ను ఉద్దేశించి పలు కీలక ప్రశ్నలు సంధించింది. "ఈ పిటిషన్ వేసి, పోరాడటానికి మీరెవరు?" అని ప్రశ్నించింది. "ఈ కేసు వివరాలు పరిశీలిస్తే ఇది పూర్తిగా వ్యక్తిగత వివాదంలా కనిపిస్తోంది. ఇందులో ఎలాంటి ప్రజా ప్రయోజనం మాకు కనిపించడం లేదు. మీరు వాదించే కొద్దీ మీపైనే అనుమానాలు పెరుగుతున్నాయి" అని జస్టిస్ సుందరేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఉండవల్లి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

# మూడు భాషల విధానం అమలుపై సుప్రీం అభ్యంతరం

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది.

పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

## మోదీ, అమిత్ షాల రాజకీయ అధ్యాయం ముగిసింది

**మొదటిపేజీ తరువాయి**

అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# 5 బిల్లులు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు-2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి.వీటితో పాటు ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

# భూ భద్రత కోసమే భూ భారతి

**మొదటిపేజీ తరువాయి**

భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని మొత్తం ఏడు గ్రామాల్లో భూ భారతి కార్యక్రమం కింద భూ సర్వే ప్రారంభమైనట్లు మంత్రి తెలిపారు. గతొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు 70 గ్రామాల చొప్పున సర్వే కొనసాగించి ఏడాదిన్నర కాలంలో ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే ప్రక్రియలో రెవెన్యూ అధికారులు నిరంతరం కష్టపడుతున్నారని.. పూర్తయిన భూ వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించామని, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ధరణి వ్యవస్థలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, వాటికి స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రంగులు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనంటూ రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయ బంధాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

# మరోసారి యుద్ధం వస్తే మరింత విధ్వంసం.

**ఢిల్లీ ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
తమ దేశంపై మరోసారి బలవంతంగా యుద్ధాన్ని రుద్దితే, ఈసారి మరింత విధ్వంసకరమైన, అత్యాధునిక ఆయుధాలను ప్రయోగిస్తామని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. గతంలో జరిగిన యుద్ధాల తర్వాత తమ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకున్నామని, ఇప్పుడు మొదలయ్యే ఎలాంటి ఘర్షణలోనైనా తమ ఆయుధాలు భిన్నంగా ఉంటాయని స్పష్టం చేసింది.

ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధికార ప్రతినిధి హుస్సేన్ మొహెబ్బి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత ఏడాది జూన్, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయెల్ మాపై రుద్దిన యుద్ధాల తర్వాత మా సైనిక శక్తిని విస్తరించుకున్నాం. ఒకవేళ కొత్తగా యుద్ధం ప్రారంభమైతే, మా క్షిపణుల వార్‌హెడ్‌లు, వాటి కచ్చితత్వం, పరిధి విషయంలో భారీ మార్పులు ఉంటాయి. గతంలో వాడిన వాటి కంటే కొత్త క్షిపణుల విధ్వంసక శక్తి చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఆయన వివరించారు. ఆయుధాల ఉత్పత్తిని ఇరాన్ ఎన్నడూ ఆపలేదని ఆయన నొక్కిచెప్పారు.మరోవైపు, అమెరికాతో రహస్య చర్చలు జరుగుతున్నాయంటూ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను మొహెబ్బి ఖండించారు. ఐఆర్‌జీసీ అధికారులు అమెరికన్లతో ఎలాంటి చర్చలు జరపడం లేదని, ట్రంప్ వ్యాఖ్యలు కేవలం 'భ్రమ' అని కొట్టిపారేశారు. వాషింగ్టన్ తన వాగ్దానాలను నిలబెట్టుకోకపోవడం వల్లే ప్రస్తుతం ఆ దేశంతో దౌత్యపరమైన చర్చలు కూడా జరగడం లేదని ఆయన తెలిపారు.ఇదే విషయంపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి కూడా స్పందించారు. ఇరాకీ కుర్దిస్థాన్ అధికారుల ద్వారా అమెరికాతో రహస్యంగా సమావేశమయ్యారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని అన్నారు. ఇరాన్ నిర్ణయాధికార వ్యవస్థలో విభేదాలు సృష్టించేందుకు పన్నుతున్న మీడియా ఎత్తుగడలు, మానసిక యుద్ధంలో భాగమే ఈ ప్రచారమని ఆయన ఆరోపించారు.గతంలో ఇరుపక్షాల మధ్య ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం, జూన్ 18న యుద్ధాన్ని ముగించేందుకు అవగాహన ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం తరచుగా కొనసాగుతూనే ఉన్నాయి.

# బయ్యారంలో మండల స్థాయి సమీక్షా సమావేశం.

**బయ్యారం/ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశం ఎంపిడివో దీపిక, తహసీల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి గ్రామాల వారీగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని,అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం,విద్యుత్,మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెవెన్యూ






శాఖ ప్రజలు మరియు రైతుల భూ సమస్యలు,భూ రికార్డుల సమస్యలు,ఆదాయ ధృవీకరణ పత్రాలు తదితర సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.వ్యవసాయ శాఖ రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చూడాలని,పంటల సాగులో రైతులకు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ గ్రామాల్లో సీసీ రోడ్లు,డ్రైనేజీలు, పారిశుధ్య పనులు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడి కేంద్రాలు,ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు భూక్యా ప్రవీణ్ నాయక్,గుగులోత్ శాంతి, బొల్లి జయంతి, పానుగోత్ వెంకన్న ఇతర గ్రామాల సర్పంచ్ లు,అన్ని శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## పప్పుదినుసుల సాగుపై రైతులకు అవగాహన.




**బయ్యారం/ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);**
బయ్యారం మండలంలో ఆత్మ నిర్భరత మిషన్ లో భాగంగా పెసర పంటను మండల వ్యవసాయ అధికారి కే.రాజు పరిశీలించారు.ఈ సందర్భంగా బయ్యారానికి చెందిన అభ్యుదయ రైతు సుంకర రాజా తన 12 ఎకరాలలో సాగు చేస్తున్న పెసర పంట సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై సూచనలు అందించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న పప్పుదినుసుల పంటలు,ముఖ్యంగా పెసర,కంది,మినుము,అలసంద వంటి పంటలను సాగు చేయాలని సూచించారు.ఇతర పంటలపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పాటిస్తూ పప్పుదినుసుల సాగును ప్రోత్సహించాలి అని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రెడ్యా నాయక్,నాగరాజు,రమేష్ పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు.



**బయ్యారం/ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);**బయ్యారం మండల కేంద్రంలోని బస్ స్టాండ్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ మాజీ టౌన్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్బంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తన చివరి శ్వాస వరకు దేశం కోసం కృషి చేశారని, గాంధీ వారసత్వాన్ని పుచ్చుకుని దేశాన్ని ప్రగతి బాటలో నడిపించారని, సాంకేతిక విప్లవం ద్వారా భారత దేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా తయారుచేశారన్నారు.ఐటీ రంగంలో హైదరాబాద్‌ను కేంద్రంగా చేసి ప్రపంచ దేశాలతో పోటీ పడేవిధంగా ముందుకు సాగాలని తపన పడ్డారని,రాజీవ్‌గాంధీ సూచించిన మార్గంలో యువత నడవా లని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్,ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా,మాజీ ఎంపీపీ కిషన్ నాయక్, మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ములుకురి వీరారెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు,వార్డు మెంబర్ బానోత్ అజయ్,కొండ్రెడ్డి సోమిరెడ్డి, తగిర సత్తిరెడ్డి,తాటి జనార్దన్, దాసరి శ్రీధర్,నందగిరి భద్రయ్య,మండల మహిళా నాయకురాలు మంద రేణుక, నందిపాటి బవాణి, కత్తి రాదాకృష్ణ,ఆకునూరు సూర్యనారాయణ,కంకటి నారాయణ,రామగిరి వెంకటేశ్వర్లు,బీరెడ్డి శ్రీనివాస్,పులి మల్లయ్య, నద్దునురి లింగయ్య, పెద్ద బుజ్జి. కంచర్ల సురేష్,రామసాని బిక్షామ్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 22న జాబ్‌మేళా.. యువతకు ఉద్యోగావకాశాలు



**మహబూబాబాద్/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ నెల 22న మహబూబాబాద్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఆదర్శ్ ఆటోమోటివ్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.రజిత తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె వివరాలు వెల్లడించారు.ఆదర్శ్ ఆటోమోటివ్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్, డ్రైవర్, ఆఫీస్ బాయ్, సర్వీస్ అడ్వైజర్, వర్క్ మేనేజర్, వాష్ బాయ్, కస్టమర్ కేర్ తదితర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వయసున్న పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, మెకానిక్ విభాగంలో డిప్లొమా విద్యార్హత కలిగిన వారు హాజరు కావచ్చున్నారు.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి:**అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22న ఐడీఓసీలోని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు విద్యార్హత ధ్రువపత్రాలు, అవసరమైన వివరాలతో హాజరు కావాలని రజిత సూచించారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## ఆరేపల్లికి అభివృద్ధి వరాలు కురిపించాలి



**ఎల్కతుర్తి/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** ఆరేపల్లి గ్రామాభివృద్ధికి మరింత సహకారం అందించాలని గ్రామ సర్పంచి పోతారబోయిన స్రవంతి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. గురువారం ఆరేపల్లిలో నిర్వహించిన పల్లె పల్లెకు పొన్నం.పల్లె పల్లెకు ప్రజాపాలన కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సర్పంచి స్రవంతి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో భాగంగా స్టీల్ ప్లేట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేపర్ ప్లేట్ల వినియోగం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఆరోగ్య పరిరక్షణతోపాటు పర్యావరణాన్ని కాపాడేందుకు స్టీల్ ప్లేట్లను వినియోగించాలని సూచించారు.సర్పంచి స్రవంతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదల ఇంటింటికీ చేరుతున్నాయని తెలిపారు. ఆరేపల్లి గ్రామంలో మౌలిక వసతుల కల్పనతోపాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## రేషన్ కార్డులపై రాజకీయ నాయకుల ఫోటోలు తొలగించాలి.



**బయ్యారం/ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న డిజిటల్ రేషన్ కార్డులపై రాజకీయ నేతల ఫోటోలు ఎందుకని బయ్యారం మండల మైనారిటీ నాయకులు సయ్యద్ మౌలానా ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి తెలంగాణ అధికారిక చిహ్నం రాజముద్ర మారదని రాష్ట్ర ప్రభుత్వ అన్ని సంక్షేమ పథకాలపై రాజకీయ నాయకుల ఫోటోలు కాకుండా రాష్ట్ర అధికారిక చిహ్నం మాత్రమే ఉండాలని మౌలానా సూచించారు.ప్రభుత్వ పథకాలను రాజకీయ ప్రచారానికి వాడడం తగదన్నారు.అధికారంలోకి ఏ పార్టీ వచ్చిన రాజకీయ నాయకుల ఫోటోలు పెట్టకూడదని సూచించారు.

## కొత్తపేట జీపీలో ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



**బయ్యారం/ఆగస్టు 20 (జర్నలిస్ట్ వార్త):** భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని కొత్తపేట గ్రామపంచాయతీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు రాజీవ్‌గాంధీ బాటలు వేశారని, గ్రామీణాభివృద్ధి, యువతకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జీవో 97 రద్దు చేయాలి.

### వల్లందాస్ కుమార్




**పర్వతగిరి/ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి పరిధిలోకి తీసుకురావద్దని, జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలని ఆర్ఎస్పీ వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం విలీన నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. కళాశాలల్లో ఆధునిక ల్యాబ్‌లు, పరికరాలు, మౌలిక వసతులు, బోధనా సిబ్బందిని పెంచాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని స్పష్టం చేశారు.

## రాజీవ్‌గాంధీకి ఎమ్మెల్యే నాగరాజు నివాళి



**వర్ధన్నపేట/ఆగస్టు 20 (జర్నలిస్ట్ వార్త):** మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ దేశ ఆధునికీకరణ, సాంకేతిక అభివృద్ధికి రాజీవ్‌గాంధీ పునాదులు వేశారని కొనియాడారు. కంప్యూటరీకరణ, టెలికమ్యూనికేషన్స్‌కు ప్రాధాన్యం ఇచ్చి భారత్‌ను 21వ శతాబ్దం వైపు నడిపించారని తెలిపారు. ఆయన త్యాగం, సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోషాల వెంకన్నగౌడ్, ఈగ దామోదర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతి బాణుప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తీగల సునీతగౌడ్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, తిరుపెల్లి వాణి, ఆలయ డైరెక్టర్ భీమా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాను నాయక్, లింగం రజితరెడ్డి, పాక సుజాత, కొండేటి మహేందర్, రామకృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్, చిధుముల్ల భాస్కర్, కాంధిక ఎల్లస్వామి, ఎండి సోహేల్, విలసారపు వెంకట్, మరుపట్ల సాయికుమార్, బిర్రు సురేందర్, శివరాత్రి వెంకట్‌నర్స్, తిరుపెల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

## పెట్రోల్ బంకులో చోరీ.. ముగ్గురి అరెస్టు




**గీసుగొండ/ఆగస్టు 20 (జర్నలిస్ట్ వార్త):** ఊకల్ శివారులోని పెట్రోల్ బంకులో నగదు చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. కాజీపేటకు చెందిన కంది చరణ్, జక్కుల ప్రతాప్, గండికోట శివను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.ఈ నెల 18న అర్ధరాత్రి వరంగల్‌నర్సంపేట ప్రధాన రహదారిపై ఉన్న పెట్రోల్ బంకులో మేనేజర్ కొడగాని వేణుగోపాల్ నిద్రిస్తున్న సమయంలో ఆయన బ్యాగులోని రూ.15,800 నగదును అపహరించినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.మరియాపురం శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఆటోను ఆపి, అందులోని ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించారని సీఐ తెలిపారు. వారి నుంచి రూ.11 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, చోరీకి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు అరవింద్, విజయ్, ప్రవీణ్, సాయిలను సీఐ విశ్వేశ్వర్ అభినందించారు.

## ఇంటి స్థలంలోకి చొరబడి దాడి.. ఒకరి అరెస్టు


### మిగిలిన ఆరుగురి కోసం పోలీసుల గాలింపు

**గీసుగొండ/ఆగస్టు 20 (జర్నలిస్ట్ వార్త):** ఇంటి స్థలానికి సంబంధించిన వివాదం దాడికి దారితీసిన ఘటనలో ఒకరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూన్ 7న జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం. ఇంటి స్థలం విషయంలో తలెత్తిన వివాదంలో దౌడు ప్రవీణ్, అతని అన్న దౌడు ప్రమోద్, తండ్రి దౌడు మొగిలిపై ఏడుగురు నిందితులు ఇంటి స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి దూషిస్తూ చేతులతో దాడి చేసినట్లు ఫిర్యాదు అందింది. ఈ దాడిలో ప్రమోద్‌కు ముక్కు, మెడ తదితర ప్రాంతాల్లో గాయాలు కాగా, ప్రవీణ్ ఎడమచేతి చూపుడు వేలుకు గాయమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ వివరించారు.

ఈ ఘటనకు సంబంధించి దౌడు అనిల్, దౌడు పోశాలు, దౌడు సువర్ణ, దౌడు సుజాత, చిన్నగారి నరేష్, చిన్నగారి లక్ష్మి, దౌడు రుషీల్ పాల్‌ను నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో దౌడు అనిల్ (45), తండ్రి పోషయ్య, గీసుగొండ గ్రామంను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు చెప్పారు. కేసులో మిగిలిన ఆరుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారని సీఐ విశ్వేశ్వర్ తెలిపారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టామని, నిందితులను చట్టపరంగా అరెస్టు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇంటి స్థలాలు, భూ వివాదాలు వ్యక్తిగత గొడవలకు దారితీయకుండా సంబంధిత వ్యక్తులు చట్టపరమైన మార్గాలను ఆశ్రయించాలని పోలీసులు సూచించారు.

# గురువుపై ఇంతటి ఘాతుకమా?

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యపై సామాజిక కార్యకర్త శశిధర్‌రెడ్డి ఆవేదన



**హుజురాబాద్/ ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** విద్యాబుద్ధులు నేర్పిన గురువునే హతమార్చడం అత్యంత దారుణమని వీణవంక మండలానికి చెందిన సామాజిక కార్యకర్త ఎలుక శశిధర్‌రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ ఘటన విద్యారంగానికే మాయని మచ్చగా మిగిలిందని పేర్కొన్నారు.

జల్సాలు, వ్యసనాల కోసం విద్యార్థులు ఇలాంటి పాశవిక చర్యకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. హత్యకు పాల్పడిన నిందితులను చట్ట ప్రకారం కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల నిఘా అవసరం**

తల్లిదండ్రులు పిల్లల చదువులు, మార్కులు, ర్యాంకులపైనే దృష్టి పెట్టకుండా వారి ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లను కూడా నిశితంగా గమనించాలని శశిధర్‌రెడ్డి సూచించారు. చిన్ననాటి నుంచే నైతిక విలువలు, బాధ్యత, క్రమశిక్షణ, జీవన నైపుణ్యాలను అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

గంజాయి, ఇతర మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు.

**పాఠశాలల్లో జీవన నైపుణ్యాల విద్య**

పుస్తక జ్ఞానంతోపాటు భావోద్వేగాలను నియంత్రించుకోవడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, మంచిచెడుల మధ్య విచక్షణ పాటించడం వంటి అంశాలను విద్యార్థులకు బోధించాలని అన్నారు. పాఠశాల స్థాయి నుంచే జీవన నైపుణ్యాల విద్యను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఇలాంటి హృదయవిదారక ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకోవాలని శశిధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# టీసీసీ వార్షికోత్సవానికి భారీగా తరలిరావాలి

**తల్లాడ/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**



తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) 13వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని టీసీసీ తల్లాడ మండల అధ్యక్షుడు బ్రదర్ కె.ఇశ్రాయేలు పిలుపునిచ్చారు. ఈ నెల 22న ఖమ్మంలోని మంచి కంటి భవన్‌లో నిర్వహించనున్న వార్షికోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి టీసీసీ బాధ్యులు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. గురువారం తల్లాడలో జరిగిన టీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు.వార్షికోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆహ్వానించినట్లు ఇశ్రాయేలు తెలిపారు. వారితోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కూడా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.భవిష్యత్ కార్యాచరణపై చర్చలువార్షికోత్సవ సమావేశంలో టీసీసీ అనుసరించాల్సిన విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణపై కీలకంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సాధించిన విజయాలను సమీక్షించడంతోపాటు రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న అంశాలపై చర్చించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.టీసీసీ వార్షికోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందున రాష్ట్రంలోని క్రైస్తవులు, టీసీసీ నాయకులు, బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇశ్రాయేలు కోరారు. సమావేశంలో టీసీసీ తల్లాడ మండల కార్యదర్శి జి.దేవసహాయం, జిల్లా నాయకుడు గుంటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# టీసీసీ వార్షికోత్సవానికి భారీగా తరలిరావాలి

**తల్లాడ/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**

తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) 13వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని టీసీసీ తల్లాడ మండల అధ్యక్షుడు బ్రదర్ కె.ఇశ్రాయేలు పిలుపునిచ్చారు. ఈ నెల 22న ఖమ్మంలోని మంచి కంటి భవన్‌లో నిర్వహించనున్న వార్షికోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి టీసీసీ బాధ్యులు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. గురువారం తల్లాడలో జరిగిన టీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు.వార్షికోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆహ్వానించినట్లు ఇశ్రాయేలు తెలిపారు. వారితోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కూడా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.భవిష్యత్ కార్యాచరణపై చర్చలువార్షికోత్సవ సమావేశంలో టీసీసీ అనుసరించాల్సిన విధివిధానాలు, భవిష్యత్ కార్యాచరణపై కీలకంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సాధించిన విజయాలను సమీక్షించడంతోపాటు రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న అంశాలపై చర్చించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు.టీసీసీ వార్షికోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నందున రాష్ట్రంలోని క్రైస్తవులు, టీసీసీ నాయకులు, బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇశ్రాయేలు కోరారు. సమావేశంలో టీసీసీ తల్లాడ మండల కార్యదర్శి జి.దేవసహాయం, జిల్లా నాయకుడు గుంటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

## తరగతుల వారీగా గుర్తించి.. ప్రత్యేక బోధన చేయాలి



**కేసముద్రం/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ కాలేరు యాదగిరి సూచించారు. తాళ్లపూసపల్లి పాఠశాల కాంప్లెక్స్‌ను గురువారం సందర్శించిన ఆయన విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.తరగతుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా రెమిడియేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని యాదగిరి అన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధనా అభ్యసన సామగ్రి(టీఎల్‌ఎం)ను రూపొందించి, కృత్యాల ఆధారంగా బోధన చేపట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అన్నారు.రికార్డులు పక్కాగా ఉండాలికాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కోట కనకయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పాఠశాలలోని అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. విద్యాధికారులు, పర్యవేక్షణ బృందాలు పాఠశాలలను సందర్శించినప్పుడు పరిశీలించే అంశాలపై ఉపాధ్యాయులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ గోపాల శ్రీధర్, రిసోర్స్ పర్సన్ యేదునూరి అశోక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు భర్తీ చేయకపోతే ఉద్యమం ఉధృతం

## నిరుద్యోగులకు న్యాయం చేయాలి.. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి




**హనుమకొండ బ్యూరో ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సముద్రాల అనిల్ డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహాధర్నాలో డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు పాలకులు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే అవకాశాలుహనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని అనిల్ డిమాండ్ చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాలు కట్టబెట్టడం సరికాదన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు.ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే నిరుద్యోగ యువతను సమీకరించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కూరుకు రంజిత్, ఉపాధ్యక్షుడు చిలుక జంపన్న, సహాయ కార్యదర్శి పల్లెపు ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు జయంతి, పవన్, మంద అజయ్, ఏసు, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పడితే చర్యలు

**మహబూబాబాద్/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కింద మంజూరైన నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.



గురువారం మహబూబాబాద్‌లోని ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలను సందర్శించిన కమిషన్ చైర్మన్, సభ్యులు అనంతరం ఐడీఓసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ శబరీష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ పురుషోత్తంతో కలిసి భూ సమస్యలు, ఆర్ఓఆర్, ఉద్యోగుల పదోన్నతులు, ఉప ప్రణాళిక నిధుల వినియోగం, సంక్షేమ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కేసుల పురోగతిపై సమీక్షించారు.

**క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి**

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వెంకటయ్య సూచించారు. ప్రజల సమస్యలను కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**కేసుల్లో జాప్యం వద్దు**

ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడంలో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను నిబంధనల మేరకు త్వరగా పరిష్కరించాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతో వదిలేయకుండా ఉపాధి, గృహ వసతి, పునరావాసం వంటి సహాయం అందించాలని సూచించారు.

**పదోన్నతుల్లో రోస్టర్ పాటించాలి**

ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేయాలని వెంకటయ్య అన్నారు. నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

ప్రతి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

ప్రతి నెల గ్రామస్థాయిలో నిర్వహించే పౌర హక్కుల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొని ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**యువతకు ఉపాధి శిక్షణ**

ఎస్సీ, ఎస్టీ యువత ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా శిక్షణ పొంది ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పంచాయతీ, సీఎస్ఆర్ నిధులను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాల కేసుల్లో తక్షణమే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ కమిషన్ సూచనల మేరకు అంబేద్కర్ స్టడీ సర్కిల్, అంబేద్కర్ భవన్, గిరిజన డిగ్రీ కళాశాలలో ఆర్వో ప్లాంట్, విదేశీ విద్య తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్న ఎస్పీ డాక్టర్ శబరీష్‌ను చైర్మన్ ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జెల్ల శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ బంద్ సక్సెస్.. జీఓ 97పై నిరసన

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?
## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు




**కేసముద్రం/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** జీఓ నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్ కేసముద్రంలో విజయవంతమైంది. విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించారని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు తెలిపారు. గురువారం పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ జీఓ 97 పేరుతో ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసి ఐటీఐ స్థాయికి పరిమితం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. సాంకేతిక విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.

**జీఓ 97ను వెంటనే వెనక్కి తీసుకోవాలి**

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే జీఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సింహాద్రి, నాయకులు మహేష్, విక్రమ్, నందీశ్వర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ ఆశయాలే నేటి తరానికి దిక్సూచి

**కేసముద్రం/ ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** ఆధునిక భారత నిర్మాణంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చూపిన దూరదృష్టి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కేసముద్రం మున్సిపాలిటీ మార్కెట్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ యువతపై నమ్మకంతో ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి ప్రజాస్వామ్యంలో యువతకు భాగస్వామ్యం కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీదేనన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, విద్యా రంగంలో సంస్కరణలు, ఐటీ, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు దేశ ప్రగతికి దోహదపడ్డాయని తెలిపారు.



చిన్న వయసులోనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని ఆధునికత వైపు నడిపించిన నాయకుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. కంప్యూటర్ యుగానికి బాటలు వేసి భారత యువతకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు అందేలా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేదల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పన, దేశ ఐక్యత కోసం రాజీవ్‌గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.శ్రీలంకలో శాంతి స్థాపనకు కృషి చేసిన రాజీవ్‌గాంధీ 1991లో శ్రీపెరంబుదూరులో జరిగిన మానవ బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. సద్భావన, ఐక్యత, యువత సాధికారత వంటి ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఇంజనీర్ నుంచి ప్రాజెక్టు మేనేజర్ వరకు

## కిట్స్ వరంగల్‌లో మెకానికల్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్



**హసన్‌పర్తి/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నిక్మార్ ప్రొఫెసర్ పి.మురళీధర్ సూచించారు. కిట్స్ వరంగల్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, మెకానికల్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ ఫర్ ఆటోమేషన్(మీసా) సంయుక్త ఆధ్వర్యంలో ఇంజనీర్ నుంచి ప్రాజెక్టు మేనేజర్ వరకుకెరీర్ గైడెన్స్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు.

క్యాంపస్‌లోని మెకానికల్ సెమినార్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మురళీధర్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు కోర్ పరిశ్రమలతోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలోనూ మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల రూపకల్పనలో మెకానికల్ ఇంజనీరింగ్ పరిజ్ఞానం కీలకంగా మారిందన్నారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నాయకత్వ లక్షణాలు, ప్రాజెక్టు నిర్వహణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ

మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీకాంత్ పబ్బా మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సీ, సీ++,డేటా స్ట్రక్చర్స్, జావా ప్రోగ్రామింగ్, కృత్రిమ మేధస్సు సంబంధిత కోర్సులతోపాటు పరిశ్రమకు అవసరమైన పలు అంశాలను సవరించిన పాఠ్యప్రణాళికలో చేర్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయడమే సెమినార్ ప్రధాన ఉద్దేశమన్నారు.

సెమినార్‌లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని ప్రశ్నలు అడిగారు. సుస్థిర అభివృద్ధి, పరిశ్రమలో మారుతున్న అవకాశాలు, ప్రాజెక్టు నిర్వహణ తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు.

కిట్స్ వరంగల్ చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, అదనపు కార్యదర్శి వొడితల సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి సెమినార్ నిర్వహించిన మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాన్ని అభినందించారు.కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.గణేష్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ దేవరాజ్, ప్రొఫెసర్ కె.శ్రీధర్, ప్రొఫెసర్ కె.రాజనరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ యు.శ్రీనివాస్ బలరాజ్, పీఆర్వో డాక్టర్ డి.ప్రభాకరాచారి, అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్లె సమస్యలపై పొన్నం ఫోకస్

## సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష.. ప్రజల వినతుల స్వీకరణ

**ఎల్కతుర్తి/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలులో అర్హులకు ఎలాంటి అన్యాయం జరగొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. పల్లె పల్లెకు పొన్నం అన్నపల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గురువారం కేశాపూర్, తిమ్మాపూర్, రామకృష్ణాపూర్, ఆరేపల్లి, బావుపేట గ్రామాల్లో మంత్రి పర్యటించారు. గ్రామ పంచాయతీల వద్ద అధికారులతో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు.

అధికారులు గ్రామాల్లో ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను మంత్రికి అందజేశారు. అనంతరం గ్రామస్థుల నుంచి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించిన మంత్రి. సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**రైతులకు రూ.22.22 కోట్ల భరోసా**

గ్రామంలో రైతు భరోసా కింద ఇప్పటివరకు రూ.22.22 కోట్లు విడుదలైనట్లు అధికారులు తెలిపారు. రైతు రుణమాఫీ కింద రూ.2.11 కోట్ల రుణాలు మాఫీ కాగా, సన్న వడ్ల బోనస్ కింద రూ.49 లక్షలు విడుదలైనట్లు వివరించారు. ఒక రైతు కుటుంబానికి రూ.5 లక్షల రైతుబీమా మంజూరైందన్నారు. మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ కింద రూ.65.18 లక్షలు విడుదలైనట్లు తెలిపారు.46 నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా, భూభారతి కింద 13 దరఖాస్తులు పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మి కింద 18 మందికి చెక్కులు అందజేసినట్లు తెలిపారు.

**త్వరలో రెండో దశ ఇందిరమ్మ ఇళ్లు**



త్వరలో రెండో దశ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. తిమ్మాపూర్‌లో అంతర్గత రోడ్లు, స్మశానవాటిక, మహిళా సంఘాలకు వీఓ భవనాలు నిర్మించాలని గ్రామస్థులు కోరగా. పాఠశాల ప్రాంతంలో వీఓ భవనం, అవసరమైన రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

**వర్షాభావంపై అప్రమత్తంగా ఉండాలి**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ప్రతి పొలంలో ఫామ్ కుంటలు నిర్మించుకోవాలని, జలసిరి కార్యక్రమం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు.





**31 వరకు పెన్షన్ దరఖాస్తులు**

ఈ నెల 31 వరకు పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని మంత్రి వెల్లడించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, తలసేమియా బాధితులు, దివ్యాంగులు తదితర అర్హులు దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మోత్కుపల్లి శ్రీకాంత్‌రెడ్డి, బొంత రమేష్, ముప్పు మానస మహేందర్, చక్రవర్తి స్రవంతి, రాజు, రవీందర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌కుమార్, తహసీల్దార్, స్పెషల్ ఆఫీసర్ ఆదిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ






**హసన్‌పర్తి/ ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను హసన్‌పర్తి మండలం చింతగట్టు గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. 65వ డివిజన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏరుకొండ శ్రీనివాస్ పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో టెలికం, ఐటీ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. రాజీవ్‌గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, భవిష్యత్ తరాలకు వారు దిక్సూచిగా నిలవాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా చింతగట్టు, మునిపల్లి, దేవన్నపేట ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఉపయోగపడేలా సుమారు 200 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో చింతగట్టు, మునిపల్లి, దేవన్నపేట గ్రామాల కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రముఖులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారి మృతికి కవిత మాలోత్ పరామర్శ


**బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..**

**బెరువాడలో మాజీ సర్పంచ్ తల్లి మృతికి నివాళి**

**కేసముద్రం/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** తీవ్ర జ్వరంతో నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన ఘటనతో కల్వల గ్రామంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ ఎంపీ కవిత మాలోత్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక ఫొటోగ్రాఫర్ ముప్ప శ్రీకాంత్ కుమారుడి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కన్నీరుమున్నీరుగా ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**మాజీ సర్పంచ్ తల్లి మృతికి నివాళి**

అనంతరం బెరువాడ గ్రామానికి వెళ్లిన కవిత మాలోత్.మాజీ సర్పంచ్ సిరి నాయక్ తల్లి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సర్పంచ్ లచ్చయ్య, కముటం శ్రీనివాస్, మాలోత్ రాజేందర్‌నాయక్, బోడ సిద్దునాయక్, గుగులోత్ లింగన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు లింగాల పిచ్చయ్య, మోడెం రవీందర్, గలయ్య, ఎదునూరి శ్రీనివాస్, శ్రీకాంత్, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.





# భరత్ చంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

## అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హసన్‌పర్తి/ ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** అమెరికాలో మృతి చెందిన హసన్‌పర్తి మండలం గంటూరుపల్లికి చెందిన వర్ణ భరత్ చంద్రారెడ్డి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భరోసా ఇచ్చారు. 15 రోజుల అనంతరం స్వగ్రామానికి చేరుకున్న భరత్ చంద్రారెడ్డి భౌతికకాయానికి గురువారం నిర్వహించిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా భరత్ చంద్రారెడ్డి మృతిపట్ల ఎమ్మెల్యే తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భరత్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అంతిమయాత్రలో గంటూరుపల్లి సర్పంచ్, హనుమకొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు చల్లా రాకేష్‌రెడ్డి, వర్ణ సుధాకర్‌రెడ్డి, వర్ణ రాజిత, పోరెడ్డి చాణిక్యరెడ్డి, పోరెడ్డి మహేందర్‌రెడ్డి, పాకాల సతీష్‌రెడ్డి, ఇనగల సురేంద్రరెడ్డి, పప్పు రవీంద్రరెడ్డి, పప్పు మైపాల్‌రెడ్డి, వర్ణ తిరుపతిరెడ్డి, వర్ణ రామారెడ్డి, కుమారస్వామి, మడిపల్లి అజయ్, మడిపల్లి రాజు, గంట రమణారెడ్డి, ఇనగల సంజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల కోసం ప్రజల అవస్థలు

## దరఖాస్తులు చేసుకున్నా కార్డులు అందడం లేదు.. బోడా ప్రవీణ్‌కుమార్




**ఏన్కూరు/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గిరిజన విద్యార్థి సంఘం ఏన్కూరు మండల అధ్యక్షుడు బోడా ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో అర్హులైన పేదలు ఉచిత రేషన్ బియ్యం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు.

రేషన్ కార్డుల ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోవడంతో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు మంజూరు కావడం లేదని పేర్కొన్నారు. దీంతో అర్హులైన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఏన్కూరు మండలంలో ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు మీసేవ కేంద్రాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. దరఖాస్తులు చేసుకున్నప్పటికీ కార్డులు అందక నిరాశతో వెనుదిరుగుతున్నారని అన్నారు.

రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను వెంటనే పునఃప్రారంభించి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కార్డులు అందించాలని బోడా ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు అందాల్సిన రేషన్ సౌకర్యం అందకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# వేలేరు జెడ్పీ పాఠశాలలో నూతన గ్రంథాలయం

## పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.38 వేల విలువైన బీరువాల వితరణ





**వేలేరు/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత (జెడ్పీ) పాఠశాలలో నూతన గ్రంథాలయాన్ని గురువారం ప్రారంభించారు. వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మీబిల్లా యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాలయాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని పాఠ్యాంశాలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

**పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత:**పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.38 వేల విలువైన బీరువాలను పాఠశాలకు అందజేశారు. పాఠశాల అవసరాలకు పూర్వ విద్యార్థులు సహకారం అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లికార్జున్, ప్రధానోపాధ్యాయుడు సత్యం, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, రాజన్న, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సన్న రకాల విత్తనాలు సాగు చేసే రైతులు నమోదు చేసుకోవాలి

## సెప్టెంబర్ 10లోగా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు.. వ్యవసాయ అధికారి రాజేష్

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**

ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు రకాల సన్న రకాల వరి విత్తనాలు సాగు చేసే రైతులు తమ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ సూచించారు. సన్న రకాల ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందించడంతో పాటు మద్దతు ధరకు కొనుగోలు చేయనున్న నేపథ్యంలో నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.

రైతులు సన్న రకాల విత్తనాలను ఎక్కడ కొనుగోలు చేసినా సంబంధిత డీలర్ వద్ద తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ముందుగానే నమోదు చేసుకుంటే ధాన్యం కొనుగోలు సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

**సొంత విత్తనమైతే స్వీయ ధ్రువీకరణ**

సొంతంగా నిల్వ చేసుకున్న విత్తనాలతో సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి వివరాలను నమోదు చేయించుకోవాలని రాజేష్ తెలిపారు.

**ఇవే ఏడు సన్న రకాలు**

బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 రకాల విత్తనాలను సాగు చేసే రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

**సెప్టెంబర్ 10 తుది గడువు**

రైతుల వివరాల నమోదుకు సెప్టెంబర్ 10, 2026 తుది గడువు అని వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు. గడువులోగా వివరాలు నమోదు చేసుకుని ధాన్యం విక్రయ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా బాధ్యతలు విజయ్‌కు
### మండల కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం






**తల్లాడ/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కొత్తపల్లి విజయ్ నియమితులయ్యారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ కమిటీ ఈ నియామకం చేపట్టింది. మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని తల్లాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండల కమిటీ ఆధ్వర్యంలో విజయ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. తల్లాడ మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సహకారంతో ముందుకు సాగుతానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన జిల్లా, మండల కాంగ్రెస్ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, సొసైటీ చైర్మన్ దిరిశాల నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, నున్న శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ ఎం.ప్రసాద్, కంచపోగు వెంకటేశ్వర్లు, కోసూరు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మర్సకట్ల బాబురావు, హెచ్‌డీ కృష్ణారెడ్డి, ఎర్రి నరసింహారావు, తుమ్మలపల్లి రమేష్, కోడూరు రాము, హరీష్‌రెడ్డి, తాళ్ల వెంకటి, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వానొస్తే రోడ్లపై నరకమే!

### బురద కూపాలుగా వెంకటాపురం వీధులు.. జారిపడుతున్న జనం.. పట్టించుకోని అధికారులు

**కల్లూరు/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):**
వర్షం పడిందంటే చాలు. వెంకటాపురం గ్రామ ప్రజలకు నరకయాతనే. రోడ్లన్నీ బురద కూపాలుగా మారి, అడుగుపెట్టేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలన్నా.. వాహనాలపై వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా ఇదే సమస్య వెంటాడుతున్నా శాశ్వత పరిష్కారం చూపే నాథుడే లేకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్లపై జారిపడుతున్న వాహనదారులు**

బురదమయమైన రోడ్లపై ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి స్కిడ్ అవుతున్నాయి. ఇప్పటికే పలువురు కిందపడి గాయాలపాలయ్యారు. కల్లూరు మండలంలోని వెంకటాపురం, తాళ్లూరు గ్రామాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్లపై నడవాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది.

**అంబులెన్స్ కూడా రాలేని దుస్థితి**

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ గ్రామంలోకి రావడానికి సైతం రోడ్లు సహకరించని దుస్థితి నెలకొంది. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆస్పత్రికి



తరలించేందుకు కుటుంబ సభ్యులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం పడిన ప్రతిసారీ ఇదే సమస్య పునరావృతమవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు.

**ప్రజల ప్రాణాలతో చెలగాటమా?**

ఏడాది పొడవునా సమస్య ఉన్నా. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతున్నా శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రామ సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా కార్యాలయాలకే పరిమితం కాకుండా వార్డుల్లో పర్యటించి ప్రజల కష్టాలను కళ్లారా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

**సీసీ రోడ్లు. డ్రైనేజీ నిర్మించాలి**

వెంకటాపురం, తాళ్లూరు గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపకపోతే ప్రజలు మరింత తీవ్రంగా ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

# మర్రి వెంకటస్వామికి సీపీఐతో సంబంధం లేదు

### పార్టీ పేరుతో ప్రెస్‌మీట్ పెట్టడం సరికాదు.. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

**ఎల్కతుర్తి/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** మర్రి వెంకటస్వామికి సీపీఐతో ప్రస్తుతం ఎలాంటి సంబంధం లేదని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి స్పష్టం చేశారు. పార్టీ పేరుతో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించడం సరికాదని అన్నారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మర్రి వెంకటస్వామి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా, ఈ ప్రాంతంలో పార్టీ నాయకుడిగా పనిచేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం పత్రికల్లో వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శిగా ఆయనను పేర్కొంటూ వార్తలు రావడం తమ దృష్టికి వచ్చిందన్నారు. సీపీఐలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల కార్యదర్శి పదవులు లేవని స్పష్టం చేశారు.

**పార్టీకి సంబంధం లేనప్పుడు పార్టీ పేరు ఎందుకు?**

గతంలోనూ పార్టీ పేరుతో కుల సంఘాలు, ఇతర



కార్యక్రమాల్లో మర్రి వెంకటస్వామి పాల్గొన్న విషయాన్ని రాష్ట్ర పార్టీ దృష్టికి తీసుకెళ్లినట్లు బిక్షపతి తెలిపారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పటి నుంచి ఆయనకు హనుమకొండ జిల్లా పార్టీతో ఎలాంటి సంబంధం లేదన్నారు.
మర్రి వెంకటస్వామి స్వగ్రామం బావుపేటలో ఏవైనా ప్రజా సమస్యలు ఉంటే స్థానిక మండల, జిల్లా పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యక్తిగత హోదాలో కార్యక్రమాలు నిర్వహించుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, వాటిని పార్టీ కార్యక్రమాలుగా చిత్రీకరించడం సరికాదని పేర్కొన్నారు.

**పార్టీ నిర్మాణానికి కట్టుబడి పనిచేయాలి**

భారత కమ్యూనిస్టు పార్టీ గ్రామ, మండల, జిల్లా స్థాయి నిర్మాణానికి అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కర్రె బిక్షపతి సూచించారు. ఎల్కతుర్తి మండల పార్టీ నాయకత్వం పార్టీ విధానాలకు అనుగుణంగా సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు.
సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శులు మర్రి విజయ్, గడ్డం రాజనర్సు, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా అవమానంపై మాజీ ఎమ్మెల్యేపై కేసు

**వర్ధన్నపేట/ఆగస్టు 20 (జర్నలిస్ట్ వార్త):** జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేశారనే ఆరోపణలపై వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ ఘటనపై వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌తో పాటు ఆయన వెంట ఉన్న మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

# పేద విద్యార్థినికి మాస్ ఆర్థిక సాయం



**వర్ధన్నపేట/ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);**
మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబ విద్యార్థిని మైదం రజిత కూతురు హైదరాబాద్‌లోని ప్రముఖ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులతో కళాశాల ఫీజు చెల్లించలేని పరిస్థితిని తెలుసుకున్న మాస్ ప్రతినిధులు స్పందించి రూ.15 వేల ఆర్థిక సాయం



అందజేశారు. ఈ సందర్భంగా మాస్ ప్రతినిధులు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఇప్పటివరకు సుమారు రూ.42 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా మరింత సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శివశంకర్, జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్, జోగుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీరే!

### డ్రైనేజీలు చెత్తాచెదారంతో కూరుకుపోయిన వైనం.. దోమలతో జనం విలవిల

**తల్లాడ/ఆగస్టు 20 (జర్నలిస్ వార్త):** గ్రామంలో ఎక్కడ చూసినా మురుగునీరు. పేరుకుపోయిన చెత్తాచెదారం. పెరిగిపోయిన కలుపు మొక్కలు. వెరసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తల్లాడ మండల పరిధిలోని బస్వాపురం గ్రామపంచాయతీ వార్డులో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా మారాయి. పాలకుల నిర్లక్ష్యానికి గ్రామంలోని పరిస్థితులే నిదర్శనంగా మారాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
వార్డులోని డ్రైనేజీలు పూర్తిగా కలుపు మొక్కలు, చెత్తాచెదారంతో పూడుకుపోయాయి. ఇరువైపులా పేడకుప్పలు పేరుకుపోవడంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు అంటువ్యాధుల భయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.



**పన్నుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ ఇదేనా?**

ప్రజల నుంచి వివిధ రకాల పన్నులు వసూలు చేయడంలో ముందుండే పంచాయతీ. కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో ఎందుకు వెనుకబడుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదేనా అభివృద్ధి? లేక నిర్లక్ష్య పాలనా? అంటూ నిలదీస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేలా పారిశుద్ధ్య వ్యవస్థను గాలికొదిలేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి**

వార్డులోని డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలని, కలుపు మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ నిర్వహించడంతో పాటు పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలని కోరుతున్నారు.
పన్నులు చెల్లిస్తున్న ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని, సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రజల తరఫున పోరాటం మరింత ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## రూ.3.14 కోట్లతో కోనారెడ్డి చెరువు అభివృద్ధి



**వర్ధన్నపేట/ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట కేంద్రంలోని కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.3.14 కోట్ల నిధులతో చేపట్టే పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను సూచించారు. వచ్చే ఏడాది నాటికి కాలువల ద్వారా రైతులకు నీరు అందేలా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మండల అధ్యక్షుడు గోశాల వెంకన్న, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.




# ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

**వర్ధన్నపేట/ ఆగస్టు 20 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో అందుతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట మున్సిపాలిటీకి చెందిన పెన్మటెచ్చా సురేష్‌కు రూ.1.75 లక్షల విలువైన సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.
ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లిన ఎమ్మెల్యే వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్య ఎదురైనా తనను లేదా తన కార్యాలయాన్ని సంప్రదించాలని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు గోశాల వెంకన్న, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి




**వర్ధన్నపేట/ ఆగస్టు 20(జర్నలిస్ట్ వార్త);** పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన కళాశాల వసతులను పరిశీలించారు. విద్యార్థులకు 30 కుర్చీలు, ఐదు టేబుళ్లు, మూడు ఉపాధ్యాయుల కుర్చీలు అందజేశారు. త్వరలో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ రాజేందర్, ప్రిన్సిపాల్ సుజాత, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.